11న అశోక్ గజపతిరాజు రాక

ప్రజాశక్తి-విజయనగరంకోట

గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఈనెల 11న జిల్లాకు రానున్నారు. గురువారం సాయంత్రం 6.45 గంటలకు తన బంగ్లాకు చేరుకుంటారు. 12న ఉదయం 11 గంటలకు కోటలో సింహచలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారితో సమావేశమవుతారు. సాయంత్రం 4.30 గంటల నుండి 5 గంటల వరకు ఫోర్ట్ హెరిటేజ్ భవనం పునర్నిర్మాణం/పునరుద్ధరణపై ఎంఇఐ కరస్పాండెంట్‌తో సమావేశమవుతారు. 13న విశాఖపట్నంలోని ఆర్.వి.సునీత ప్రసాద్ గృహానికి వెళ్తారు. 14న ఉదయం 11 గంటలకు పివిజి కళ్యాణ మండపం జొన్నగుడ్డిలో జరిగే క్షత్రీయ పరిషత్ కార్యక్రమంలో పాల్గొంటారు. 15న మాన్సాస్ ట్రస్టు బడ్జెట్ సమావేశంలో పాల్గొంటారు. 16న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో కోటలో జరిగే లంచ్ కార్యక్రమంలో పాల్గొంటారు. 17న గోవా వెళ్తారు.

ఆశాజనకంగా ధాన్యం దిగుబడి

- ఎకరాకు 33బస్తాలు
- గతం కన్నా నాలుగు బస్తాలు అధికం
- అన్నదాతలో ఆనందం
- విక్రయ ఇబ్బందుల్లో తప్పని అవస్థలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది ధాన్యం దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. మునుపెన్నడూ లేనంతగా సగటున ఎకరాకు 80కేజీల బరువులగల 33 బస్తాలు ఉత్పత్తి కనిపిస్తోంది. గత ఏడాది 29బస్తాలు దిగుబడి వచ్చింది. గత ఏడాదితో పోలిస్తే నాలుగు బస్తాలు పెరగడంతో అన్నదాతలో ఆనందం కనిపిస్తోంది. కానీ, వాటి విక్రయాల్లో పడుతున్న అవస్థలు, తూకంలో మోసం వంటివి ఎప్పటి మాదిరిగానే రైతులను ఒకింత నిరాసకు గురిచేస్తున్నాయి. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పంటలన్నీ కలుపుకుని దాదాపు 4లక్షల ఎకరాల్లో సాగవుతుండగా, అత్యధికంగా వరి 3,09, 652 ఎకరాల్లో సాగైంది. గత ఏడాదితో పోలిస్తే 69వేల ఎకరాల మేర అధికంగా సాగు అయినట్టు వ్యవసాయ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సీజన్ ప్రారంభం నుంచీ వర్షాలు అనుకూలించడం ఇందుకు కారణం. నవంబరులో వచ్చిన ముంథా తుపాను కురిసిన ఒకింత కలవరపాటుకు గురిచేసినప్పటికీ తగిన సమయంలో తెరుపు ఇచ్చింది. ఆ తరువాత వర్ష సూచన ఉండడంతో రైతులు కాస్త ఉత్కంఠకు గురైనప్పటికీ ముప్పు తప్పింది. ప్రస్తుతం 75శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఇందులో 1714 పంటకోత ప్రయోగాలు 78శాతం పూర్తయ్యాయి. ఈలెక్కన సగటు ఎకరాకు 80కేజీల బరువుగల బస్తాల దిగుబడి వచ్చినట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఉత్పత్తి, నాణ్యత విషయంలో కొత్తవలస, నెల్లిమర్ల, రామభద్రపురం, నెల్లిమర్ల, సంతకవిటి, మెరకముడిదాం, డెంకాడ, బాడంగి తదితర మండలాలు ముందు వరుసలో ఉన్నట్టు విశ్లేషణలు ఉన్నాయి. అయితే, ఈ ఏడాది గతంతో పోలిస్తే వరి సాగులో పెట్టుబడి కూడా పెరిగింది. ముఖ్యంగా తగిన సమయంలో యూరియా కొరత ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రైవేటు వ్యాపారులు, బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలు చెల్లించుకోవాల్సిన పరిస్థితి కూడా ఎదురైంది. చీడపీడలను ఎదుర్కోవాల్సి వచ్చింది. వీటన్నింటినీ అధిగమించి ఆశాజనకమైన దిగుబడి సాధించినప్పటికీ సకాలంలో కొనుగోలు చేసేందుకు వీలుగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయలేదు. ప్రస్తుతం ధాన్యపు బస్తాలు, రాసులు కల్లాల్లోనే ఉన్నాయి. మరోవైపు వాతావరణం పూటకో మాదిరిగా ఉండడం వల్ల టెన్షన్‌కు గురౌతున్నారు.

ప్రారంభమైన రబీ పంటలు

జిల్లాలో రబీ పంటల సాగు ప్రారంభమైంది. మన జిల్లాలో ఖరీఫ్‌తో పోల్చుకుంటే రబీ పంటల సాగు నామమాత్రంగానే ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా వరి, మొక్కజొన్న, నువ్వులు, పెసలు, మినుములు చెరకు, మొక్కజొన్న, రాగులు తదితర 12రకాల పంటల సాగు విస్తీర్ణం 1,44,152 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 47,275 ఎకరాల్లో సాగు కనిపిస్తోంది. అత్యధికంగా పెసలు 47శాతం, మినుములు 43శాతం సాగయ్యాయి. వీటితోపాటు మొక్కజొన్న, రాగులు, రాగులు ఏపుగా పెరిగే దశలో ఉన్నాయి. వరి నాట్లు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. వరి సాధారణ విస్తీర్ణం 5,175 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 80 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. చెరకు, వేరుశనగ మొలకెత్తే దశలో ఉన్నాయి. మొత్తం పంటన్నీ కలిపి ఇప్పటి వరకు 33శాతం పూర్తయ్యాయి.

వైద్య సదుపాయాలను మెరుగుపర్చాలి

- కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి
- జిజిహెచ్ అభివృద్ధికి పలు కీలక నిర్ణయాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా ప్రభుత్వ సర్వజన భోదనాసుపత్రి, అనుబంధ ఘోషాసుపత్రిలో వైద్య సదుపాయాలను మెరుగు పర్చేందుకు, అదనపు వసతులు కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. అందుబాటులో ఉన్న నిధులతో అత్యవసర వైద్య పరికరాలను వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. భవనాలు ఇతర మౌలిక సదుపాయాల కోసం మరో సమావేశం ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టిబి ఆసుపత్రి, ఆవరణను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. కలెక్టర్, ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ ఛైర్మన్ రాంసుందర్ రెడ్డి, కో ఛైర్మన్ , ఎంఎల్ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం జిజిహెచ్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. ప్రధానంగా మౌలిక వసతుల కల్పనపై చర్చ జరిగింది. జిజిహెచ్‌లోని అత్యవసరేతర విభాగాలను గాజులరేగ సమీపంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలోకి తరలించే అంశంపై త్వరలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. జిజిహెచ్‌లో ఉన్న డిసిహెచ్ఎస్ కార్యాలయం, హోమియో వైద్యశాల, ఎఆర్‌టి సెంటర్ తరలింపుపై చర్చించారు. ఆసుపత్రిలో కొత్తగా ఒక లైఫ్ సపోర్టు అంబులెన్స్ ఏర్పాటు, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం, నెఫ్రాలజీ విభాగంలో డయాలసిస్ యూనిట్, దానికి అనుబంధంగా ఆర్ఓ ప్లాంటు, దినసరి వేతనంపై ఇద్దరు క్షురకుల నియామకం, జనరిక్ మందులషాపు ఏర్పాటు, ఘోషాసుపత్రిలో పలు భవనాల నిర్మాణం, 15 సిసి కెమేరాల ఏర్పాటుకు, రూ.20లక్షలు విలువైన డయాథెర్మీ పరికరం ఏర్పాటు, వివిధ ధ్రువపత్రాలకు ఛార్జీల పెంపు, డేటా ఎంట్రీ అపరేటర్ల నియామకం, వేతనాల పెంపుపై చర్చించి ఆమోదించారు. ఎంఎల్ఎ అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ, ఆసుపత్రి అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో రోగులకు వసతి సరిపోవడం లేదని, అందువల్ల తక్షణమే డిసిహెచ్ఎస్ కార్యాలయాన్ని తరలించాలని కోరారు. బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటిండెంట్, సొసైటీ మెంబర్ కన్వీనర్ డాక్టర్ అల్లు పద్మజ, సొసూటీ సభ్యులు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.దేవి మాధవి, ఇన్‌ఛార్జి డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ కె.రాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎన్‌పి పద్మశ్రీరాణి, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ ఎన్.భారతి, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, కోఆప్షన్ సభ్యులు డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు, డాక్టర్ వంకాయల అశోక్, ఇమ్మిడి సుధీర్, ఎస్.అనురాధాబేగం, పలువురు డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అదితి

ప్రాజెక్టులకు భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, తోటపల్లి, తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టులు, జాతీయ రహదారి 130 (సిడి), జాతీయ రహదారి 516(బి), కుర్ధారోడ్-విజయనగరం మూడో రైల్వే లైన్, కొత్తవలస-విజయనగరం నాలుగో రైల్వేలైన్ తదితర ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్షించారు. భూసేకరణ ప్రకటన, పరిహారం చెల్లింపు తదితర అంశాలపై ఆరా తీశారు. వీటన్నిటినీ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేథుమాధవన్, ఆర్‌డిఓలు డి.కీర్తి, సత్యవాణి, రామ్మోహన్, ఎస్‌డిసి కళావతి, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు, ఇరిగేషన్ ఇఇ వెంకటరమణ, పలు శాఖల అధికారులు, తాహశీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.



విద్యార్థులకు బోధిస్తున్న డిఇఒ మాణిక్యం నాయుడు

పాఠశాలను పరిశీలించిన డిఇఒ

ప్రజాశకి-బొండపల్లి

బొండపల్లి మండలం ఒంపల్లి జెడ్‌పి పాఠశాలను డిఇఒ మాణిక్యంనాయుడు మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల తరగతి గదులను పరిశీలించి, విద్యార్థుల ప్రగతిని అంచనా వేశారు. వంద రోజులు కార్యాచరణ ప్రణాళికను అమలు తీరును సమీక్షించారు. విద్యార్థులతో మాట్లాడి, బోధన విధానాలు, ఎస్ఎ 1 పరీక్ష ఫలితాలు, రోజువారీ ప్రత్యేక తరగతులు జరుగుతున్న తీరు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇందులో సబ్జెక్ట్‌వారీ పర్యవేక్షణ, ఉపాధ్యాయుల పనితీరు, రికార్డులు, మరియు బోధన నాణ్యతను మెరుగు పరచేందుకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

ఎన్ఆర్ఇజిఎస్ అమలుపై మంత్రి సమీక్ష

ప్రజాశక్తి- కంటోన్మెంట్

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేయాలని, ఉపాధి హామీ సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకంపై మంగళవారం డ్వామా అధికారులతో సమీక్షించారు. మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా చేపట్టిన పనులను పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఇప్పటికే ఈ పథకం కింద చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపు, పెండింగ్ బిల్లుల స్థితి ఆయా పనుల పురోగతిపై ప్రధానంగా చర్చ జరిగింది. సమావేశంలో డ్వామా పీడీ శారదాదేవి, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస్, ఇఇ రత్నకుమార్, బొబ్బిలి ఇఇ రమణమూర్తి పాల్గొన్నారు.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమం

ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 10న మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో నగరంలోని 45, 46వ డివిజన్లలో ఐద్వా ఆధ్వర్యాన హింసకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ మహిళలపై రోజు రోజుకూ పెరుగుతున్న హింసను కట్టడి చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. హింసకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ మత్తులో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగి పోతున్నాయని, మహిళా రక్షణ కు ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పుణ్యవతి, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా కార్యదర్శి రమణమ్మ

13న పారా రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో 4వ రాష్ట్ర స్థాయి పారా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నారని జిల్లా క్రీడాధికారి ఎస్. వెంకటేశ్వర రావు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో పోటీలకు సంబంధించిన గోడ పత్రికను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్‌తో కలిసి విడుదల చేసారు. ఈ పోటీలకు అన్ని జిల్లాల నుండి పారా క్రీడాకారులు హాజరు కానున్నారని, జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాలకు సంబంధించి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఉత్తరాఖండ్ లో జరుగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాల కొరకు 9849377577 నంబర్ ను సంప్రదించాలని సూచించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డి అరుణ్‌బాబు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. మంగళవారం జిల్లాలో ఆయన పర్యటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసే లక్ష్యంలో భాగంగా ఆయన జిల్లాకు విచ్చేసి, గృహ నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. హౌసింగ్ కాలనీలను సందర్శించారు. విజయనగరం మండలం గొల్లలపేటలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0 లో భాగంగా ఇక్కడ నిర్మిస్తున్న 106 ఇళ్లను సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ ఇళ్లను ఉగాది నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జామి మండలం కుమరాంలో పిఎంఎవై డిమాండ్ సర్వేలో భాగంగా ఉపయోగించే ఆవాస్ ప్లస్ యాప్ 2024 ద్వారా చెక్కర్ మాడ్యూల్‌లో లబ్ధిదారుల వివరాలను క్షేత్ర స్థాయిలో క్రాస్ చెకింగ్ చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ ప్రక్రియను ఈనెల 15 నాటికి గ్రామాల వారీగా జిల్లాలో పూర్తి చేయాలని ఆదేశించారు. గుంకలాం మెగా లే అవుట్ కాలనీని సందర్శించి ఇళ్లను పరిశీలించారు. ఈ ఇళ్లను కూడా మార్చి 2026 నాటికి పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ అధికారులను ఆదేశించారు.

గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఎమ్‌డి అరుణ్‌బాబు

పోగొట్టుకున్న మొబైళ్లు బాధితులకు అందజేత

మొబైల్ ట్రాకింగుకు పోలీసు సేవలు మరింత సులభతరం : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న మొబైల్స్‌ను సైబరు సెల్ పోలీసులు గత కొద్ది రోజుల్లో ట్రేస్ చేసిన సుమారు రూ. 26,78,792 విలువైన 163 మొబైళ్లను తిరిగి బాధితులకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌పి ఎఆర్ దామోదర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో మొబైల్స్ పోగొట్టుకున్న బాధితులు ఇకపై విజయనగరంలోని సైబరు సెల్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, తమకు దగ్గరలోని పోలీసు స్టేషన్‌ను సంప్రదించి, పోగొట్టుకున్న మొబైల్స్ వివరాలను అందించినట్లయితే, వారు ఆ ఫిర్యాదును 'మిస్సింగు మొబైల్ ట్రాకింగ్ సిస్టం' ద్వారా పోయిన మొబైలు ట్రాక్ చేసేందుకు చర్యలు చేపడతారని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు రూ.6.23కోట్ల విలువైన 3,463 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి, బాధితులకు అందజేసామన్నారు. సమావేశంలో సైబరు సెల్ సిఐ శోభన్ బాబు, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, అంబేద్కర్, డిసిఆర్‌బి సిఐ కే.కుమార స్వామి, ఎస్ఐ రాజేష్, సైబర్ సెల్ సిబ్బంది శ్రీనివాసరావు, వాసుదేవ్, తిరుపతి నాయుడు, రాజేష్, నాగమణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పి దామోదర్‌తో మొబైళ్లు అందుకున్న బాధితులు

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

నియోజకవర్గంలో 54 వేల సంతకాలు సేకరణ
మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గంలో పార్టీ పిలుపుమేరకు 54 వేలు సంతకాలు సేకరిచామని,ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాడుతామని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య, విద్యా రంగాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలనే వైసిపి ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందన్నారు. వాటిని కొనసాగించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణమని అన్నారు. మెడికల్ కాలేజీలు వలన ఉపయోగాలు తెలియజేయాలని ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వానికి, గవర్నర్ కి తెలియజేయాలని ఉద్దేశ్యంతో కోటి సంతకాలు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈనెల 15 తేదీన ఏడు నియోజకవర్గాల ప్రజలతో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మేయర్ వెంపడాపు.విజయలక్ష్మి, డిప్యూటి మేయర్ శ్రావణి,ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, నగర పార్టీ అధ్యక్షుడు అసపు.వేణు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు

వన్ స్టాప్ వెహికల్ హెల్ప్‌లైను వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మహిళల అత్యవసర సేవల కోసం వన్ స్టాప్ వెహికల్ హెల్ప్ లైను వాహనాన్ని మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. వన్ స్టాప్ సెంటర్ వాహనాల ప్రధాన ఉద్దేశం హింసకు గురైన మహిళలకు తక్షణ సహాయం అందించడం, ఇందులో వైద్యం, న్యాయం, పోలీస్ సహాయం, కౌన్సెలింగ్, తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలను ఒకే చోట (ఒకే పైకప్పు కింద) సమగ్రంగా అందుబాటులో ఉంచడం దీని ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ అన్నారు. ఆపదలో ఉన్న మహిళా హెల్ప్ లైను వాహనం వన్ స్టాప్ సెంటరుగా మహిళలకు ఉపయోగపడుతుందన్నారు. హెల్ప్‌లైన్ పోలీసు (100), ఆసుపత్రి (108), 181 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా మహిళలు అత్యవసర సేవలు మహిళలకు వైద్య సహాయం, పోలీసు సహాయం, చట్ట సహాయం, కౌన్సిలింగు, తాత్కాలిక ఆశ్రయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ విమలరాణి, డిఎంసి సుజాత, వన్ స్టాప్ సెంటర్, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన తెలపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2010కు ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ టెట్ పై సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. వంద రోజులు యాక్షన్ ప్లాన్ నుండి ఆదివారాలు, పబ్లిక్ హాలిడేలు మినహాయించి రీ షెడ్యూల్ చెయ్యాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చెయ్యాలన్నారు. అనంతరం డిఆర్‌ఒకు వినతి అందజేశారు. ధర్నాలో యుటిఎఫ్ నాయకులు సిహెచ్ తిరుపతి నాయుడు, జి.రాజారావు, శ్రీదేవి, అల్లు శంకరరావు, గంగాధర్, ఎస్.వెంకటరావు, పల్లి.శ్రీనివాసరావు, సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

19న తపాలా అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 19న ఉదయం 11గంటలకు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో తపాలా అదాలత్, పెన్షన్ అదాలత్ నిర్వహిస్తామని సూపరింటెండెంట్ అఫ్ పోస్టాఫీసు కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్‌లో చర్చిస్తామని తెలిపారు. విజయనగరం పోస్టల్ డివిజన్ లోని పోస్టల్ వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈనెల 15లోగా తపాలాశాఖ కార్యాలయం, విజయనగరం కార్యాలయానికి పంపాలని తెలిపారు.

గాంధీ ఆశయాలు అనుసరణీయం

జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

గాంధీ సూచించిన అహింస, శాంతి, పరమత సహనం వంటి ఆశయాలు మన దేశానికి ఎల్లవేళలా అవసరమని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు అన్నారు. గాంధీ స్మారక నిధి పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో గాంధీజీ ఆశయాలు-నేటి సమాజం అన్న అంశంపై సదస్సును నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ ఉద్యమం ఒక్క అడుగుతో మొదలవుతుందని, ఉద్యమంలో ఎంతమంది ఉన్నా, ఆ ఉద్యమాన్ని ఒకే ఒక్కడు నడిపిస్తారని, ఆ ఒక్కడే గాంధీ అని, గాంధీ చేసిన అహింస పోరాటం ఫలితంగానే దేశానికి స్వాతంత్రం సిద్ధించిందని అన్నారు. మతం మనుషుల మధ్య ఐక్యతను పెంచాలే తప్ప విద్వేషాలు పెంచకూడదని విజ్ఞప్తి చేశారు. మతాలు మనుషుల మధ్య ఐక్యతను కాకుండా విద్వేషాలు పెంచితే అది దేశానికి ఎంతో ప్రమాదకరమని గాంధీ ఆనాడే సూచించారని పేర్కొన్నారు. కానీ పాలకుల వల్ల దేశంలో మత విద్వేషాలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న మాట్లాడుతూ దేశ స్వాతంత్రంలో గాంధీ పాత్ర ఎంతో కీలకమైనదని, ఆయన స్ఫూర్తిని పాలకులు కొనసాగిస్తే దేశానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం గాంధీ స్మారక నిధి పట్టణ శాఖ పూర్వ కార్యవర్గ సభ్యులను సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి పట్టణ శాఖ అధ్యక్షుడు కర్రొతు సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్దింటి అప్పారావు, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, కోశాధికారి జి.నారాయణ, ధవళ సర్వేశ్వరరావు, పి.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఎన్ వెంకటరావు

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి : కలెక్టర్

శృంగవరపుకోట: మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. దాతల సహాయంతో లక్కవరపుకోట తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 13 మంది మహనీయుల విగ్రహాలను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను యువత ప్రేరణ పొంది మార్గదర్శంగా తీసుకోవాలన్నారు. తహశీల్దార్ శ్రీనివాసరావు ఇప్పటి వరకు పని చేసిన ఏడు చోట్ల తహశీల్దార్ కార్యాలయాలలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసి కార్యాలయాలను నూతన భవనాలుగా తీర్చిదిద్దారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాట్ల కీర్తి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, విగ్రహ దాతలు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన

జామి: డ్రగ్స్ వద్దు బ్రో.. అన్న నినాదంతో డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా మార్చాలన్న లక్ష్యంతో ఈగల్ సెల్ ఆధ్వర్యంలో కుమరాం ఫైనల్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈగల్ సెల్ విజయనగరం బృందం డ్రగ్స్ దుర్వినియోగంపై విద్యార్థులకు వివరించారు. ఇటీవలి కాలంలో విద్యార్థులు డ్రగ్స్ భారిన పడటానికి గల కారణాలు, వాటి భారిన పడితే కలిగే నష్టాలను, డ్రగ్స్ అలవాటు పడకుండా ఉండటానికి పాటించవలసిన నియమాలను విద్యార్థులకు వివరించారు. ఎన్‌డిపిఎస్ చట్టంలోని నేరాలను, వాటి శిక్షలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ విజయకుమార్, పిసిలు వెంకటేష్, కోటేశ్వరావు, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకుల నివారణకు చర్యలు

బొబ్బిలి: పైపులైన్ లీకులు నివారణకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ సిబ్బందిని కమిషనర్ ఎల్. రామలక్ష్మి ఆదేశించారు. మున్సిపాలిటీలోని కోర్టు జంక్షన్, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు ప్రాంతాలలో పర్యటించారు. కోర్టు జంక్షన్‌లో పైపులైన్ లీకు కావడంతో తాగునీరు వృథాగా పోతుందని, లీకులను నివారించాలని ఇంజనీరింగ్ ఉద్యోగులను ఆదేశించారు. అన్న క్యాంటీన్ వద్ద ఫ్లోరింగ్ పలకలు ఊడిపోవడంతో వాటిని మరమ్మతులు చేయించాలన్నారు. 910 కెఎల్ రిజర్వాయర్ వద్ద ఉన్న చెత్తను తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీకు సూచించారు.

రైతులకు అవగాహన

నెల్లిమర్ల: మండలంలోని మల్యాడ గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ఎఒ శ్రీలక్ష్మి పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ మోతాదులో ఎరువులు, యూరియా వినియోగిస్తే ఖర్చు తగ్గడమే కాకుండా పంట దిగుబడి పెరుగుతుందన్నారు. జొన్నవలస రైతు సేవా కేంద్రం యూరియా ధర్తి మాత బచావో అభియాన్ (భూమాత పరిరక్షణ కమిటీ) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు, రైతులు పాల్గొన్నారు.

యువత ఆలోచనలో మార్పు రావాలి

బొండపల్లి: యువత ఆలోచనలో మార్పు వచ్చినప్పుడే సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుందని ఎస్ఐ యు.మహేష్ అన్నారు. మంగళవారం మండల సముదాయం వద్ద రోడ్డు ప్రమాదాలు -నివారణ అనే అంశం పై వాహనాలు నడుపుతున్న యువతకు అవగాహన కల్పించారు. యువత ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. వాహనాలకు సంబంధించిన ద్రువపత్రాలతో పాటు లైసెన్స్, హెల్మెట్ తప్పనసరిగా ఉండాలని స్పష్టం చేశారు. యువత వాహనంతో ఇంటి నుంచి బయలు దేరినప్పుడు కుటుంబ సభ్యులు ఉన్నారనే వాస్తవాన్ని గ్రహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ లెంక గోవింద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ విభజనకు దరఖాస్తు

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస గ్రామానికి నూతన పంచాయతీ కోసం గ్రామ ప్రజలు గ్రామ సభలో కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నారని పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ తెలిపారు. మరడాం పంచాయతీ మధుర గ్రామమైన మర్రివలస పంచాయతీ విభజన కోసం గ్రామ సర్పంచ్ తీర్మానం ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా గ్రామపంచాయతీలు ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవాలని తెలుపగా గ్రామస్తులు తమకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మి, టిడిపి నాయకుడు రామారావు, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అవగాహన

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పిల్లలపై లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయం ఎఓ ఎస్.మహేష్, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎ.వేణు, సైకాలజిస్ట్ రాజు, ఆర్‌కెఎస్‌కె కౌన్సిలర్ వసంత, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎడమ కాలువ భూసేకరణ పై గ్రామసభ

వేపాడ: మండలంలోని పికెఆర్‌పురంలో మంగళవారం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ నిమిత్తం ప్రజలతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎవిఎస్ కళావతి సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ కాలువ నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలకు గ్రామ ప్రజలు సహకరించాలని రైతులను కోరారు.

పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే, నాయకులు

టిడిపిలో వంద కుటుంబాలు చేరిక

విజయనగరం కోట: నగరంలోని 28వ డివిజన్ కు చెందిన బర్ల నాగేశ్వరరావు, సత్యవేణి ఆధ్వర్యంలో వంద కుటుంబాలు మంగళవారం టిడిపిలో చేరాయి. వారందరికీ ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి సంక్షేమం చూసి పార్టీలో చేరుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా రవి, ప్రధాన కార్యదర్శి కోరాడరాజా, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పాత అప్పలనాయుడు, అవనాపు విజయ్, 28వ డివిజన్ కు చెందిన బర్ల నాగేశ్వరరావు బర్ల సత్యవేణి, వార్డు మాజీ అధ్యక్షులు పాకలపాటి వేణు రాజు , బలివాడ ఆదినారాయణ, ఇట్ల రమేష్ పాల్గొన్నారు.

సిబిఐ విచారణ జరిపించాలి

శృంగవరపుకోట: జిందాల్ భూముల వ్యవహారంపై సిబిఐ విచారణ చేపట్టాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ జిందాల్ భూముల నిర్వాసితుల ఉద్యమాలను ప్రభుత్వం నిర్మూలించేందుకు వ్యవహరించడం దారుణమన్నారు. 179 రోజులుగా రైతులు తమ హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారని, వారికి న్యాయస్థానంలో కచ్చితంగా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిందాల్ వ్యవహారంలో అనేక అవకతవకలు జరిగాయని ఎమ్మెల్సీ ఆరోపించారు.

సిఎంఆర్‌ఎఫ్‌కు సహకరిస్తాం

శృంగవరపుకోట: నియోజకవర్గంలోని ఎవరికైనా ముఖ్యమంత్రి సహాయనిది కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటే, సిఎం రిలీఫ్ ఫండకు సంబంధించిన పత్రాలు, అర్హతలు, ప్రాసెస్ వంటి ఏ విషయమైనా సహాయం అవసరమైతే పట్టణంలోని ఆర్కే కళ్యాణ మండపం వద్ద గల టిడిపి కార్యాలయంలో సంప్రదించాలని డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేయడానికి అవసరమైన డాక్యుమెంట్స్, వివరాలు, దరఖాస్తు విధానం గురించి తమ టీమ్ పూర్తిగా మార్గదర్శనం చేస్తుందని మరిన్ని వివరాలకు 83285 83467, 98855 77145ను కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

మెరుగైన జీవన ప్రమాణాల కోసం పి -4

శృంగవరపు కోట: బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించడమే పి4 ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం లక్కవరపుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో కళ్ళేపల్లి, లచ్చంపేట గ్రామాలకు చెందిన రెండు పేద కుటుంబాల వివాహాలకు మండల అంజలి, చప్ప సౌజన్యకి చెరో రూ.25వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. నాయకులందరూ బంగారు కుటుంబాల బాధ్యతను తీసుకునే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్, ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్ర శేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కరెడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల విభజన కోసం ఆరాటం

◆పెద్ద పెంచాయతీలను విడగొట్టాలని వినతులు ◆ప్రభుత్వ జిఒతో గ్రామాల్లో సందడి ◆నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి- డెంకాడ

గతంలో పంచాయతీలను విభజించకుండా నిషేధించిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ నిషేధాన్ని ఎత్తివేసి పంచాయతీలు విభజన కోసం జిఒను జారీ చేసింది. దీంతో మరోసారి పంచాయతీల విభజన అంశం తెరపైకి వచ్చింది. గ్రామాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు తమ గ్రామాలను విభజించుకొని అభివృద్ధి చేసుకోవచ్చన్న పేరిట పంచాయతీల విభజనకు పట్టుబడుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని చింతలవలస పంచాయతీలో చింతలవలస గ్రామం ఒక పంచాయతీగా, చింతలవలస పరిధిలో ఉన్న ఎపిఎస్‌పి బెటాలియన్, బిసి కాలనీ, ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాల చుట్టు పక్కల ప్రాంతమంతా కలిపి చింతలవలస-2 పంచాయతీగా విభజన చేయాలని స్థానిక నాయకులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉన్నతాధికారులకు సైతం వినతి పత్రాలను సమర్పించారు. పెద్దతాడివాడ పంచాయతీ పరిధిలో ఉన్న ఊడికలపేట, చిన్న బేతనాపల్లి, పెద్ద బేతనాపల్లి మూడు గ్రామాలను పెద్దతాడివాడ పంచాయతీ నుంచి విభజించి ఈ మూడు గ్రామాలను ఒక పంచాయతీగా చేయాలని ఆ గ్రామాలకు చెందిన కొంతమంది నాయకులు ఇటీవల వినతి పత్రాలను అందజేశారు. ఇప్పటికే పెద్దతాడివాడలో పంచాయతీ పరిధిలో ఉన్న గుండాలపేటను విభజించి వేరొక పంచాయతీగా మార్చే ప్రయత్నం చేగా

పెద్దతాడివాడ గ్రామం

గ్రామస్తులు కోర్టును ఆశ్రయించడంతో విభజన నిలిపేశారు. ఇప్పుడు మిగిలిన మూడు గ్రామాలను కలిపి ఒక పంచాయతీగా విభజించాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

మండలంలో చింతలవలస, డెంకాడ, పెద్దతాడివాడ, అక్కివరం, చొల్లంగిపేట, మోధవలసలు పెద్ద పంచాయతీలుగా ఉన్నాయి. ఈ పంచాయతీలలో మోదవలస పంచాయతీలో ఏడు గ్రామాలు, చొల్లంగిపేట పంచాయతీలో 12 గ్రామాలు, అక్కివరంలో 5 గ్రామాలు విలీనమై ఉన్నాయి. ఈ పంచాయతీలలో ఉన్న మధుర గ్రామాలు పంచాయతీ హెడ్ క్వార్టర్‌కు దూరంగానే ఉన్నాయి. ఇప్పుడు పంచాయతీలను విభజించుకోవచ్చు అని ప్రభుత్వం జీవో ఇవ్వడంతో ఆయా గ్రామస్తులు ప్రజాప్రతినిధులు తమ పంచాయతీలను విభజించుకుంటే బాగుంటుందని ఆలోచనతో అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు పరుగులు పెడుతున్నారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే?

పంచాయతీలను విభజించుకోవడానికి ప్రభుత్వం జిఒ 542ను ఇచ్చింది. ఈ జిఒ ప్రకారం పంచాయతీ హెడ్ క్వార్టర్‌కు కొత్తగా పంచాయతీ కావాలనుకున్న మధుర గ్రామం మూడు కిలోమీటర్ల దూరంలో ఉండాలి. ఆ గ్రామం వేరొక పేరుతో ఉండాలి. గ్రామంలో సుమారు 3వేల మందికి పైబడి జనాభా ఉండాలి. ఆ గ్రామానికి సంవత్సరానికి సుమారు రూ.3వేలు ఆదాయం వచ్చేటట్టు ఉండాలి అని జిఒలో పొందుపరిచారు. విభజిస్తున్న గ్రామం పంచాయతీ గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరం ఉన్నట్లు పిఆర్ఎఇ సర్టిఫికెట్ ఇవ్వాలని జీవోలో తెలిపారు. గ్రామసభ పంచాయతీ తీర్మానం, ఆమోదం పొందినట్లు ప్రభుత్వానికి నివేదించాలి. వీటన్నింటిని ప్రభుత్వం పరిశీలించి ప్రత్యేకమైన భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలు విభజించడానికి అవకాశం ఉంటుంది. మండలంలో ప్రస్తుతం 26 పంచాయతీలు 17 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో ఇప్పుడు ప్రభుత్వం విభజన కోసం జీవో ఇవ్వడంతో ఎన్ని పంచాయితీలు విభజన చేస్తారో ఎవరి పలుకుబడి ఎంత ఉందో చూడాల మరి.

జెఎన్‌టియులో పీజీ సర్టిఫికేట్ కోర్సులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియుజివి దామోదరం సంజీవయ్య నేషనల్‌లా యూనివర్శిటీల సంయుక్త ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధస్సు, సాంకేతికత, చట్టం" పై పీజీ సర్టిఫికేట్ ప్రోగ్రాంకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని జెఎన్‌టియుజివి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సుబ్బారావు తెలిపారు. ఏడాది వ్యవధిలో హైబ్రిడ్ మోడ్‌లో బోధన విద్యార్థులు, ఉద్యోగులు, ప్రభుత్వ అధికారులందరికీ అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ క్లాసులు సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8.30గంటల వరకు ఉంటుందన్నారు. ల్యాబ్ సెషన్లు శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 2 నుంచి సాయంత్రం 5వరకు జరుగుతాయన్నారు. జనవరి 20నుంచి కోర్సు ప్రారంభమవుతుందని తెలిపారు. దరఖాస్తు ఫీజు వెయ్యి రూపాయలు, ప్రోగ్రాం ఫీజు రూ.30వేలు అని తెలిపారు. మరిన్ని వివరాల నమోదు కోసం ఇమెయిల్ pgcpaitl@jntugv.edu.in, వెబ్‌సైట్ https://pgcpaitl.jntugv.edu.in, రిజిస్ట్రేషన్ లింకు https://sl1nk.com/Kf7RP అని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎయిర్ పోర్ట్ సబ్ స్టేషన్ పనులు అడ్డగింత

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలో నిర్మితమవుతున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి విద్యుత్ సరఫరా కోసం 132 /11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు ముక్కాం రెవెన్యూ పరిధిలో 4.50 ఎకరాల భూమిని కేటాయించారు. 3.98 ఎకరాల జిరాయతీ భూమి కాగా, అందులో 52 సెంట్లు డి.పట్టా భూమిని ప్రభుత్వం సేకరించింది. జిరాయితీ భూమికి సంబంధించి భూ పరిహారం ప్రభుత్వం ఇప్పటికే రైతులకు చెల్లించినట్లు తెలిసింది. డి.పట్టా రైతు అయిన కోరాడ రామసూరి మాత్రం భూ పరిహారం కోసం హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ వరకు బాగానే ఉన్నా ఈ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముక్కాం రోడ్డుకు ఆనుకొని నిర్మిస్తున్నారు. దీంతో సబ్ స్టేషన్ వెనకాల ఉన్నా రైతుల భూములకు వెళ్లేందుకు తోవ లేకపోవడంతో రైతులు రెవెన్యూ అధికారులను సంప్రదించారు. సబ్ స్టేషన్ పక్క నుంచి వెళ్లేందుకు పది అడుగుల తోవను ఆర్‌డిఒ కేటాయించారు. సబ్ స్టేషన్ నిర్మాణం చేస్తున్నా సదరు గుత్తేదారుడు వెనుక ఉన్న భూములకు వెళ్లేందుకు తోవ లేకుండా ప్రహరీ గోడ నిర్మించేందుకు జెసిబితో పనులు చేసున్నారని తెలియడంతో

అధికారులతో మాట్లాడుతున్న రైతులు

కొంగవాణి పాలెం గ్రామానికి చెందిన రైతులు ఆ పనులను అడ్డుకున్నారు. రైతుల సమస్యను పరిష్కరించి, రైతులకు రోడ్డు మార్గం చూపెట్టిన తరువాతే సబ్ స్టేషన్ పనులు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానిక అధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. మరో పక్క సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాదవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎయిర్ పోర్ట్ వచ్చే ఏడాది జూన్‌లో ప్రాభించేందుకు ప్రభుత్వం సిద్దపడుతుంటే మీరు ఇంత నెమ్మదిగా పనులు చేస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పని వేగం పెంచాలని సూచించారు.

మహిళా సంఘాల బలోపేతానికి శిక్షణ : పీడీ

ప్రజాశక్తి- రేగిడి

గ్రామస్థాయి మహిళా సంఘాల బలోపేతానికి శిక్షణలు దోహదపడతాయని డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి విఒఎ, గ్రామ సంఘ అధ్యక్షులకు ఐదురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాలలో సంస్థలను బలోపేతానికి చేసేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చి ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం గోవిందరావు, ఎల్‌సి వెంకరావు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఎపిఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ ద్వారా గ్రామ స్థాయిలో ప్రణాళికా సామర్థ్యాలు, విజన్ బిల్డింగ్, వనరుల గుర్తింపు, వినియోగంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తుమ్మరోతు లలిత, ఎల్‌సిసి నర్సింగరావు, సిసిలు సూరిబాబు, విశ్వేశ్వరరావు, మంజుశ్రీ, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలంటే మహిళ చేతిలో ఉందని వెలుగు ఎపిడి సావిత్రి అన్నారు. మంగళవారం గంట్యాడ వెలుగు కార్యాలయంలో

మహిళలతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస్ పాణి

జరిగిన విజన్ బిల్డింగ్ మాడ్యూల్ శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భర్త పై ఆధారపడకుండా ఉండడం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మినాయుడు, పశువైద్యాధికారి మూర్తి, ఐబిఎపిఎం విశ్వేశ్వరరావు, ఎపిఎం సులోచన దేవి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ధాన్యం సేకరణ : జెసి

ప్రజాశక్తి-వేపాడ

ధాన్యం సేకరణ ప్రక్రియను పకడ్బంధీగా నిర్వహించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. ఆయన వేపాడ మండలంలో మంగళవారం పర్యటించారు. ముందుగా బల్లంకి గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ సిబ్బంది నిర్వహిస్తున్న కొనుగోలు ప్రక్రియను, తేమ కొలిచే విధానాన్ని పరిశీలించారు. రైతులు ఇబ్బంది పడకుండా వీలైనంత వేగంగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం రామస్వామిపేటలోని లక్ష్మీశ్రీనివాస రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ట్రక్‌షీట్లు, గోనె సంచులను పరిశీలించారు. సజావుగా మిల్లింగ్ పూర్తి చేసి, సిఎంఆర్ అందజేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తాహశీల్దార్ రాములమ్మ, ఎంపిడిఒ, వ్యవసాయశాఖ ఎఒ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడితే చర్యలు

బొబ్బిలి: ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల జిల్లా మేనేజర్ బి.శాంతి అన్నారు. మండలంలోని మంగళవారం శివడవలస, పిరిడి, కోమటిపల్లి రైసు మిల్లులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహించినా, రైతులను ఇబ్బందులు పెట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లర్లు, అధికారులతో మాట్లాడి ధాన్యం సేకరణ, మిల్లింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలని మిలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: రైతులకు ధాన్యం డబ్బులు వారి

జెసికి సమస్యను వివరిస్తున్న ఎంపిటిసి తులసీ

అకౌంట్లో తక్షణమే జమ అయ్యేందుకు జాప్యం జగకుండా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కస్టోడియల్ లాగిన్ నుండి మిల్లర్ లాగిన్‌కు ట్రక్ షీట్లు జాప్యం జరగకుండా ఆర్ఐ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మిల్లర్లను పరిశీలించడం జరిగింది. మండలంలో శ్రీ సాయి శ్రీనివాస ఆగ్రో ఫుడ్స్, లక్ష్మీ శృతి ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లులను పరిశీలించారు. అన్ని సక్రమ రీతిలో నడుస్తుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

కొవ్వాడలో డిపిఒ విచారణ

పూసపాటిరేగ : మండలంలోని కొవ్వాడలో శ్మశానం షెడ్‌ను అనుమతి లేకుండా తొలగించారని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు మేరకు మంగళవారం డిపిఒ శిరీషరాణి పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాది ఎస్. హరిబాబును, సర్పంచ్ కోట్ల రఘును తమ అభిప్రాయాలు చెప్పాలని కోరారు. ఎటువంటి అనుమతులూ లేకుండా శ్మశానంలో షెడ్‌ను తొలగించారని, ఆ స్థానంలో మళ్లీ షెడ్ నిర్మాణం జరగాలని, తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు దారుడు కోరారు. శ్మశానంలో షెడ్ వాస్తుకు విరుద్ధంగా ఉందని గ్రామ పురోహి హితుడు చెప్పాడని, గ్రామంలో అకాల మరణాలు జరుగుతున్నాయని, భయాందోళనకు గురైన గ్రామస్తులే షెడ్ తొలగించుకున్నారని సర్పంచ్ రఘు తెలిపారు. షెడ్ తొలగించాలని గ్రామ సభ పెట్టి తీర్మానం చేసామన్నారు. నిధులు లేమితో తాము ఆ పని చేయలేకపోయామన్నారు. దీంతో గ్రామస్తులే భయంతో తొలగించేశారన్నారు. ఆ షెడ్‌ను వేరే శ్మశానంలో కట్టడానికి గ్రామస్తులు సిద్ధంగా ఉన్నారన్నారు. దీంతో స్పందించిన డిపిఒ మీ ఇరువురి అభిప్రాయాలను రాతపూర్వకంగా ఇవ్వాలని కోరారు. అనంతరం శ్మశాన వాటికను పరిశీలించారు. ఆమెతో పాట ఎంపిడిఒ రాధిక, ఇఒపిఆర్‌డి జ్ఞానేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఇపిఎఫ్ కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇపిఎఫ్ కనీస పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని ఇపిఎఫ్ పింఛన్ దార్ల సంఘం జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, మండల నాయకులు మొయిద పాపారావు, కనకల పద్మనాభం డిమాండ్ చేశారు. మంగళవారం కనీస పింఛన్ 9,000 ఇవ్వాలని కోరుతూ జరజాపుపేటలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 11సంవత్సరాల నుండి ఇపిఎఫ్ పింఛన్‌దార్లకు కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలని పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపిఎఫ్ ఉద్యోగులు, కార్మికులకు సంబంధించి రూ.10లక్షల కోట్లు ఇపిఎఫ్ సంస్థ వద్ద ఉన్నాయని ఆ నిధులను షేర్ మార్కెట్లకు తరలించి ఇపిఎఫ్ పింఛన్‌దార్లకు అన్యాయం చేయడం తగదని అన్నారు. పార్లమెంట్ శీతాకాల

నిరసన తెలుపుతున్న పింఛనర్లు,నాయకులు

సమావేశాల్లో కనీస పింఛను 9,000 ఇవ్వాలని తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9,10 తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద పెద్ద ధర్నా జరుగుతుందని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పింఛన్ దార్లు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి- డెంకాడ, భోగాపురం

డెంకాడ, భోగాపురం పోలీసు స్టేషనులను జిల్లా ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ మంగళవారం సందర్శించారు. పోలీసు స్టేషను రికార్డులు, సీడీ ఫైల్స్‌ను పరిశీలించి రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్టేషను పరిధిలో రహదారి ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను, బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలను నియంత్రించేందుకు స్టాపర్లు, లైటింగు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ రోజూ విధిగా విజిబుల్ పోలీసింగు నిర్వహించాలని, హెల్మెట్స్ ధారణ, రహదారి భద్రత నియమాలు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల నియంత్రణకు వాహన తనిఖీలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై డ్రంకన్ డ్రైవ్ కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ఓపెన్ డ్రింకింగు కేసులు నమోదు చేయాలన్నారు.వాహన తనిఖీల్లో పెండింగు ఈ-చలానాలు ఉన్నట్లుగా గుర్తిస్తే, ఆయా వాహనాలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

పంట రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలి

డిసిసిబి చైర్మన్ నాగార్జున

ప్రజాశక్తి - చీపురుపల్లి

జిల్లాలో వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన పంట రుణాలను రైతులకు త్వరితగతిన మంజూరు చేయాలని జిల్లా డిసిసిబి చైర్మన్ నాగార్జున అధికారులను కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పిఎసిఎస్ చైర్మెన్లు అర్హత గల రైతులకు పంట రుణాలు మంజూరును త్వరగా పూర్తి చేయాలని కోరారు. రైతుల నుండి అవసరమైన ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, వన్ బి, అడంగల్, వంటి ధ్రుపత్రాలను తీసుకొని రుణాలను మంజూరు చేయాలని ఆదేశించారు. ఎకరా వరి పంటకు రూ.49వేలు, మొక్కజొన్న పంటకు రూ.46వేలు, చెరకు పంటకు రూ.80వేలు, అరటి పంటకు రూ.75వేలు చొప్పున, రైతులకు ఏడు శాతం వడ్డీ పైన రుణాలను మంజూరు చేయాలని ఆదేశించారు. సకాలంలో రుణాలను చెల్లించిన రైతులకు కేంద్ర ప్రభుత్వం మూడు శాతం, రాష్ట్ర ప్రభుత్వం నాలుగు శాతం, రీయంబర్స్‌మెంట్ ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

మోడల్ పేపర్స్‌తో ప్రయోజనం

ప్రజాశక్తి - రామభద్రపురం

పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి మోడల్ పేపర్స్ అత్యంత ప్రయోజనకరమని ఎంఇఒ తిరుమల ప్రసాద్ అన్నారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం యుటిఎఫ్ ఆధ్వర్యంలో అత్యంత విద్యార్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తయారు చేసిన పదో తరగతి మోడల్ పేపర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా ఈ పేపర్లు ఉపయోగించుకొని అధిక మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం గోపాలనాయుడు, ఉపాధ్యాయులు కృష్ణవేణి, వెంకటరావు, ధనంజయరాజు, ప్రసాదరావు, శంకరరావు, సత్యారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నిర్ణీత సమయానికి విధులకు హాజరై పనులు ముగించుకోవాలని చెప్పారు. దోమలు అధికంగా ఉన్న ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్‌లను చేపట్టాలన్నారు. ఆ తర్వాత 11,12వ నెంబర్ల సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, స్వచ్ఛ సచివాలయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అనంతరం అన్న క్యాంటీన్ ను సందర్శించి, ప్రజలకు అందుతున్న ఆహారం వంటి విషయాలు, పారిశుధ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

యుద్ధ ప్రాతిపదికన ఓటర్లు జాబితా సరిపోల్చాలి

2002లో నమోదైన ఓటర్లను 2005 సంవత్సరంతో సరిపోల్చే విధానాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని బూత్ లెవెల్ అధికారులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఆయా ఓటర్ల వివరాలు సరిపోల్చాలన్నారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) CUM SPL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (MOBILE), Vizianagaram
EP 178/2019, OS 28/2019

Between
Tirunagari Balaram .....Decree Holder
and
Vadapalli Adilakshmi @ Lakshmi and others .....Judgement Debtor

పై నెంబరులో డిక్రీ బాకి వసూలు నిమిత్తం Judgment Debtor తాలుకా గల దిగువ షెడ్యూలు దాఖలా wetland యిస్థిహారు ప్రకారం పై కోర్టువారు **తే 23-12-2025దీన (మంగళవారం) పగలు గం॥ 10.30** నుండి బహిరంగముగ వేలం వేయుదురు. కావున పాడుకొనదలచినవారు పై కోర్టువారు ఎదుట వేలంలో పాడుకొనవచ్చునని యిందుమూలంగా అందరికీ తెలియజేయడమైనది.

SCHEDULE

Item No.1 Wetland in S.N.154-5A to an extent of AC.0.05 cents situated at Singavaram Village in Denkada Revenue Mandal, Vizianagaram District, Full extent of the schedule property.

సదరు Wet landకు వగైరా యావత్తు యీజిమెంటు హక్కులతో సహ,

D.Hr Value of	----
Amine Value of	----
Market Value of	Rs.1,00,000-00
Test Warent Value	Rs.4,50,000-00
(Local Market Value)	

Jdr. Value not furnished.

Smt. D.Shree Chalam
Dist. Court, Vizianagaram,
Advocate for D.Hr
Cell: 9666238599

జారిపడ్డ విద్యార్థికి మెరుగైన వైద్యం

చీపురుపల్లి: స్థానిక జివిఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆకాష్ అనే విద్యార్థి గత రాత్రి ట్రాక్టర్ పై నుండి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక సోషల్ వెల్ఫేర్ వసతి గృహ అధికారి మంగళగిరి శ్రీనివాసరావు విద్యార్థిని చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం కేంద్రాసుపత్రికి తరలించి అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. జామి మండలం అలమండకు చెందిన విద్యార్థి వసతి గృహంలో ఉంటూ పాలిటెక్నికల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రాణపాయ స్థితి నుంచి బయట పడ్డాడని అధికారులు చెప్పారు.

ఎసి మరమ్మతుల దుకాణంలో అగ్నిప్రమాదం

రాజాం: పట్టణంలోని డోలాపేటలో గల ఎసి మరమ్మత్తుల షాపులో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే రాజాం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, పోలీసులు అగ్నిమాపక వాహనంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎల్రక్టానిక్ పరికరాలు, రిమ్మల్స్, ఎసిలు, ఫ్రిజ్ లు, కూలర్లు, ఫ్యాన్లు, ఇతరత్రా పరికరాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. షాప్ ఓనర్ బ్యాంకరు ఉపేంద్ర ఇచ్చిన సమాచారం మేరకు షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు.

వాహనాల వేలంతో ప్రభుత్వానికి ఆదాయం

రాజాం: పోలీస్ స్టేషన్‌లో పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటకు సంబంధించి ముందుగానే ప్రకటన చేయడంతో రాజాం నలుమూలల నుంచి భారీగా పాటదారులు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. మూడు బైక్‌లకు వేలం నిర్వహించడం ద్వారా ప్రభుత్వానికి రూ. 86వేలు వచ్చినట్లు సిఐ అశోక్ కుమార్ తెలిపారు.

వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం ధ్వంసం

రాజాం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన మద్యం సీసాలను మంగళవారం ఎక్సైజ్ ఎఇఎస్ శ్రీరంగందొర, సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. మూడు కేసుల్లో పట్టుబడిన సుమారు రూ. 11వేలు విలువైన 9 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం బాటిల్ తెచ్చి విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలో ప్రభుత్వ సేవల అమలు పరిస్థితులను పరిశీలించేందుకు మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరావు, మండల సచివాలయాల అధికారి సీతారామరాజు మంగళవారం సాయంత్రం పలు గ్రామ సచివాలయాలను సందర్శించారు. ఈ క్రమంలో భోగాపురం-1, 2, అమాటాం, రాయివలస, గూడెపువలస గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయాల పనితీరు, సిబ్బంది హాజరు, ప్రజలకు అందిస్తున్న సేవల వేగం, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. ప్రజలకు మరింత పారదర్శకంగా, వేగంగా సేవలు అందించేందుకు అవసరమైన సూచనలు సిబ్బందికి చేశారు.